

సాగు నీటిపై స్పష్టత ఏదీ?

- జూరాల ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు విడుదల కాని నీరు
- ఎడమ కాల్వ కింద 65 వేల ఎకరాలు, కుడి కాల్వ కింద 35 వేల ఎకరాల సాగు
- నారు పోసుకునేందుకు ఎదురు చూస్తున్న రైతులు
- ప్రాజెక్టు నిండాకే అంటున్న అధికారులు
- తాగు నీటికి సమాంతర కాల్వ ద్వారా సరఫరా



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

ఆత్మకూరు, జూన్ 21: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలపై స్పష్టత కరువైంది. దాంతో ప్రాజెక్టు ఎడమ కాలువ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వానాకాలం సీజన్‌లో మాత్రమే సాగు నీటిని అందించారు. యాసంగిలో పంటలకు నీరివ్వకపోవడంతో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ప్రస్తుత వానాకాలంలో



తాగునీటి కోసం విడుదల చేస్తున్న నీరు

నైనా నీరు ఎప్పుడిస్తారో అధికారులు చెప్పకపోవడంతో నార్లు పోసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు అయోమయంలో పడ్డారు. ప్రాజెక్టు ఎడమ కాలువ కింద 65 వేల ఎకరాలు, కుడి కాలువ కింద 35 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది.

గత ఏడాది జూలైలో విడుదల

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎడమ కాలువ ద్వారా జూలై రెండో వారంలో సాగు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు రోజూ ఐదు వేల క్యూసెక్కులకుపైగా నీరు చేరుతోంది. ప్రాజెక్టులో ఆరు టీఎంసీలకుపైగా నీరు నిల్వ ఉంది. దాంతో ఈసారైనా నార్లు పోసుకునేందుకు ముందుగానే నీటిని విడుదల చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఎడమ కాల్వ ద్వారా నీటిని ఇవ్వడం లేదు. ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న సమాంతర కాలువ ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని వదులుతున్నారు. ఇకనైనా ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆయా గ్రామాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ముందుగా నీరిస్తే యాసంగికి ఇబ్బంది ఉండదు

ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి మట్టం చేరుకున్నాకే నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. గత ఏడాది కూడా ప్రాజెక్టు నిండాకే విడుదల చేశారు. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదను ఆధారం చేసుకుని సమాంతర కాలువ ద్వారా తాగునీటి కోసం పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. దాంతో ప్రాజెక్టు నిండాలంటే ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమాంతర కాల్వ ద్వారా విడుదల చేసే నీటిని ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తే.. ముందుగానే నార్లు పోసుకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. వానాకాలంలో పంటలు తొందరగా పూర్తయితే.. యాసంగిలో కూడా ఏప్రిల్ మొదటి వారం నాటికే పంటలు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి ఈ నెల చివరి వారంలోనైనా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటిని విడుదల చేయాలి



గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా జూరాల నుంచి నీటిని ఆలస్యంగా విడుదల చేశారు. యాసంగిలో రెండో పంట సాగుకు నీరివ్వలేదు. ఈ సారైనా ఎడమ కాల్వ ద్వారా ముందుగా నీరిస్తే రెండో పంటను ఏప్రిల్ మొదటి వారం నాటికే పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

- విష్ణువర్ధన్ రెడ్డి, ఎడమ కాలువ ఆయకట్టు రైతు సంఘం నాయకులు

సమావేశం అనంతరమే సాగు నీరు



ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదను ఆధారంగా చేసుకుని తాగునీటి అవసరాల కోసం దిగువకు వదులుతున్నాం. మరో రెండు మూడు రోజుల్లో తాగునీటికి కూడా నీటిని నిలిపేస్తాం. దాంతో వరద ఆధారంగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది. జూలై మొదటి వారంలో సమావేశం నిర్వహించి, రెండో వారంలో సాగు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

- జగన్మోహన్, ప్రాజెక్టు ఈఈ

యోగాసనాలు వేస్తున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ తదితరులు

యోగాతో.. ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి, యోగా గురించి అవగాహన కల్పించారు. ఆయా చోట్ల వక్తలు మాట్లాడుతూ రోజూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విన్యాసాలు అబ్బురపరిచాయి.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో యోగా చేస్తున్న మహిళ

విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



యోగా చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



తెలకపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థులు



ఆకట్టుకున్న విన్యాసాలు



కొల్లాపూర్‌లో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పెద్ద జీతగాడిగా పని చేస్తా

- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

వనపర్తి టౌన్, జూన్ 21: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి తనకు ఓటు వేసి లక్ష మెజారిటీతో గెలిపించిన ప్రజలందరికీ తాను పెద్ద జీతగాడిగా పని చేస్తానని ఎంపీ మల్లు రవి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తిలో మల్లు రవి విజయోత్సవ ర్యాలీ నిరహించారు. జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుంచి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లురవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఎమ్మెల్యేలు పూజారులైతే తాను మాత్రం ప్రధాన పూజారినని, ప్రజలందరూ దేవుళ్లని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పెద్ద మోసానికి ఒడిగట్టాయని, రెండు పార్టీలు రహస్య ఒప్పందంతో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రయత్నించాయని చెప్పారు. కానీ ప్రజలు మాత్రం భారత రాజ్యాంగానికి రక్షణగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అయితేనే బాగుంటుందన్న సదుద్దేశంతో దాదాపు లక్ష మెజారిటీతో పట్టం కట్టారని అన్నారు. కేంద్రంతో, రాష్ట్రంతో మాట్లాడి వనపర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కృషి చేస్తానన్నారు. వనపర్తికి త్వరలోనే రైల్వేలైన్ తేవడానికి ప్రయత్నిస్తానని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో పరిశ్రమలు తెచ్చి ఉపాధి అవకాశాలు పెంచుతానని అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మోడల్ ఎమ్మెల్యేగా ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నాడన్నారు.

మాజీ మంత్రి అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అవినీతి అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు చేశానని, త్వరలోనే ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. తనకంటే నిరంజన్‌రెడ్డి శిష్యులకే ఆయన్ను జైలుకు పంపడంపై ఉబలాటం ఎక్కువైందన్నారు. వారందరి కోరిక మేరకు దేవాదాయ భూముల కబ్జా, చెరువు కట్టలు, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, పెబ్బేరు సంత తదితర అవినీతి అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు చేశానన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలతో కలెక్టర్ నేతృత్వంలో విచారణ ప్రారంభమైందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ స్క్రాప్‌నకు వెళ్లిందని, నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలో కాంగ్రెస్ పార్టీకి తెలుసని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, బండారు శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, లక్కాకుల సతీష్ పాల్గొన్నారు.

● ఎంపీగా విజయం సాధించాక మొదటిసారి పెబ్బేరుకు వచ్చిన డాక్టర్ మల్లురవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పెబ్బేరు మండల నాయకులు జాతీయ రహదారి బైపాస్ వద్ద శుక్రవారం ఘన స్వాగతం పలికారు. భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యేలు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

అందని రవాణా భత్యం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- ఇతర గ్రామాలకు వెళ్లే బస్సు సౌకర్యం లేని వారికి వర్తింపు
- నాలుగేళ్లుగా ఇవ్వని డబ్బులు
- ఛార్జీలకు పైసల్లేక లేక బడి మానిపిస్తున్న తల్లిదండ్రులు

అయిజ, జూన్ 21: రవాణా భత్యం అందక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత ఊర్లో చదువుకునే అవకాశం లేక, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేని వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రవాణా భత్యం అందజేస్తోంది. అది నాలుగేళ్లుగా అందకపోవడంతో రోజూ ఆటోలు, ప్రైవేటు బస్సుల్లో వెళ్లి చదువుకోవడం విద్యార్థులకు ఆర్థిక భారంగా మారుతోంది.

అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ విద్యార్థులు పక్క గ్రామమైన యాపదిన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్తున్నారు. గట్టు మండలం అంతంపల్లి విద్యార్థులు ఉత్తనూరుకు సైకిళ్లపై వెళుతున్నారు. అయిజ మండలం సంకాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు కూడా రెండు ప్రైవేటు వాహనాలను మాట్లాడుకుని ఉత్తనూరు పాఠశాలకు వస్తున్నారు.



గట్టు మండలం అంతంపల్లి నుంచి అయిజ మండలం ఉత్తనూర్ ప్రభుత్వ పాఠశాలకు సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థులు

ఇతర గ్రామాల నుంచి 66 పాఠశాలలకు విద్యార్థులు

గ్రామం నుంచి పాఠశాలకు ఐదు కిలో మీటర్ల దూరం పైబడి ఉంటే రవాణా భత్యం అందిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు నెలకు రూ.400, ఆరు నుంచి 10వ తరగతి వరకు రూ.600 అందజేయాల్సి ఉంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 460 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 69,200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 460 పాఠశాలల్లో 66 పాఠశాలలు ఆయా గ్రామాలకు ఐదు కిలోమీటర్లకుపైగా దూరంగా ఉన్నాయి. అక్కడికి బస్సు సౌకర్యం కూడా లేదు. దాంతో విద్యార్థులు ఆటోలు, ప్రైవేటు వాహనాలు, లారీల్లో పాఠశాలలకు వెళ్తున్నారు. మరికొందరు సైకిళ్లపై వెళ్తుండగా, ఇంకొందరు నడుచుకుంటూ పాఠశాలలకు చేరుకుంటున్నారు. 2018-2019 విద్యా సంవత్సరం వరకు మాత్రమే రవాణా భత్యం అందజేశారు.



ప్రైవేటు వాహనంలో ఉత్తనూరు పాఠశాలకు వెళ్తున్న సంకాపూర్, మూగోనిపల్లి గ్రామాల విద్యార్థులు

2020-21లో 1,220 మంది విద్యార్థులు, 2021-22లో 1,135, 2022-23లో 1,150, 2023-24 విద్యా సంవత్సరంలో 995 మంది విద్యార్థులు తమ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నట్లుగా అధికారులు గుర్తించారు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

విద్యార్థుల ట్రావెలింగ్ అలవెన్స్ కోసం ఏటా ప్రతిపాదనలు పంపుతున్నాం. బ్యాంకు ఖాతాలు తెరిస్తే డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెప్పింది. పల్లెల్లో ఉన్న బ్యాంకులకు వెళ్లి ఖాతాలు తెరిచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపటం లేదు. అలాగే నేను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ బ్యాంకు ఖాతాలో జమచేస్తే అనుకూలంగా ఉంటుంది.

- మేడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

స్కూలు మాన్పిస్తున్న తల్లిదండ్రులు

రవాణా భత్యం ఇవ్వక పోవడంతో పిల్లలను బడులకు పంపేందుకు ఇబ్బందిగా ఉందని చార్జీలకు డబ్బులు లేని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఖర్చులు, పంటల పెట్టుబడులకే ఇబ్బందిగా ఉందని, మళ్లీ చార్జీలకు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు పిల్లలు స్కూళ్లు మానేయిస్తున్న సంఘటనలు కూడా ఉంటున్నాయి. ఈ ప్రభుత్వమైనా స్పందించి ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధిని వేగవంతం చేయాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ
- సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో అధికారులతో సమావేశం



పశువైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

వంగూరు, జూన్ 21: అచ్చంపేట నియోజకవర్గానికి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులపై కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో ఆయన ఇంట్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజూరైన అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియను చేపట్టి, పనులను వెంటనే చేపట్టాలని చెప్పారు. రోడ్ల పనులపై పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆస్పత్రుల భవనాల నిర్మాణాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో పశువైద్యశాల, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ, గ్రంథాలయం భవనాలు, అధునాతన ఎల్‌ఈడీ వీధి దీపాలు, బస్టాండ్, చిల్డ్రన్స్ పార్కు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జంగిరెడ్డిపల్లి, జూపల్లి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అదే విధంగా వంగూరు మండల కార్యాలయాల కాంప్లెక్స్, వ్యవసాయ ఉత్పత్తుల గోదాం నిర్మాణాలకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, జిల్లా పశువైద్య శాఖ అధికారి రమేష్, మండల పశు వైద్య అధికారి అజీత్‌చంద్ర, నాయకులు వేమారెడ్డి, రమేష్ గౌడ్, టీకే రెడ్డి, పీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గద్వాల ఎస్పీ బాధ్యతల స్వీకరణ

గద్వాల క్రైం, జూన్ 21: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని జోగుళాంబ గద్వాల ఎస్పీ తోట శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయనకు డీఎస్పీలు సత్యనారాయణ, నరేందర్‌రావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శ్రీనివాసరావు 2007 బ్యాచ్ గ్రూప్-1 అధికారిగా నియమితులై, పాడేరు, జనగామలలో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. నందిగామ, కృష్ణ, కొత్తగూడెంలలో ఓఎస్‌డీగా పని చేశారు. అదనపు ఎస్పీగా పదోన్నతితో స్టేట్ ఇంటలిజెన్స్ విభాగంలో పని చేస్తూ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత గవర్నర్ దగ్గర ఏడీసీగా బాధ్యతలు చేపట్టారు. 2013లో ఐపీఎస్‌గా పదోన్నతి పొంది సీఐడీ విభాగం, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేశారు. బాలనగర్‌లో డీసీపీగా పని చేస్తూ, గద్వాలకు ఎస్పీగా వచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాగనూరు, జూన్ 21 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం తెల్ల వారుజామున నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వర్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుజాత ఆమె బావ చనిపోవడంతో గురువారం ఇంటికి తాళం వేసి దినవారానికి వెళ్లింది. ఈ క్ర మంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారం, ఒకటిన్నర తులాల వెండి, చిల్లర నాణేలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితు రాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 21 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పరీక్ష డివిజినల్ అకౌంట్స్ అధికారుల పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందర బోయి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారులతో పరీక్ష నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పరీక్ష, అదేవిధంగా ఈనెల 30 నుంచి జులై నాలుగవ తేదీ వరకు డివిజినల్ అకౌంట్స్ అధికారుల పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. పరీక్షా కేంద్రంలోని సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికా రులను ఆదేశించారు. అదేవిధంగా, అభ్యర్థుల చెకింగ్, హాల్‌టికెట్స్ పరిశీల నకు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దమందడి, జూన్ 21 : కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లమా కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 200 సీట్లకు గాను ఆదిలాబాద్, సూర్యాపేటలోని గడ్డిపల్లి, మహబూబాబాద్‌లోని తొర్రూర్‌తో పాటు, నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్, వనపర్తి జిల్లాలోని మోజర్ల ఉద్యానవన కళాశా లలో 40 చొప్పున సీట్లు ఖాళీలు ఉన్నాయని పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. ఈనెల 15 నుంచి జులై 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలీ సెట్ 2024లో లేదా పదో తరగతిలో పాస్ అయిన వారు లేదా ఇంటర్మీ డియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లమాకు దరఖాస్తు చేసుకోవ చ్చున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు కొత్తగా మరో నాలుగు పీజీ సీట్లు


కళాశాల డైరెక్టర్‌కు స్వీట్లు తినిపిస్తున్న పిడియాట్రిక్ వైద్యులు

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం), జూన్ 21 : మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు కొత్తగా మరో నాలుగు పీజీ సీట్లు మంజూరు చేస్తూ జాతీయ వైద్య మండలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రెండు విభాగాలకు మాత్రం పీజీ సీట్ల అనుమతిని తిరస్కరించింది. మొదటిసారి ఆన్‌లైన్ దరఖాస్తుల విధానంతో సీట్లు మంజూరు చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా కేటాయించిన సీట్లు అమల్లోకి రానున్నాయి.

మొత్తం 30 పీజీ సీట్లు

ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఎనిమిది నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. అందులో అనాటమి, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్, ఎస్పీఎం విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా జనరల్ ఆసుపత్రిలో(క్లినికల్) గైనకాలజీ విభాగంలో మూడు పీజీ సీట్లు ఉన్నాయి. కళాశాలలో మొత్తం 26 పీజీ సీట్లు ఇదివరకే ఉన్నాయి. ప్రస్తుతం అదనంగా మరో నాలుగు కొత్త పీజీ సీట్లు రావడంతో ఆ సంఖ్య 30కి చేరింది. వీటిని జనరల్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగానికి మంజూరు చేశారు.

డైరెక్టర్‌కు శుభాకాంక్షలు

క్లినికల్ విభాగంలోని పిడియాట్రిక్‌లో మరో నాలుగు పీజీ సీట్లు రావడానికి కృషి చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేష్, సిబ్బందికి జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జీవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలోని డైరెక్టర్ చాంబర్‌లో ఆయన కేక్ కట్ చేశారు. డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, స్వీట్లు పంచిపెట్టారు. పిడియాట్రిక్ విభాగాధిపతి డా.సురేష్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రంజిత్, డా.జగదీష్, డా.సిరాజుద్దీన్, డా.రంజిత్‌కుమార్, డా.శ్రీపాల్‌రెడ్డి, డా.నగేష్, డా.విజయ్, డా.మమత, ఎస్ఆర్‌లు డా.తన్వి, డా.వర్ష, డా.జ్యోతి ఉన్నారు.

ఏరువాక ఏర్పాట్లలో అన్నదాతలు

- నేడే రైతులకు పెద్ద పండుగ
- ఎద్దుల అలంకరణ సామగ్రి కొనుగోలులో రైతులు


పేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల గజ్జెలు, తాళ్లు, పూసల తాళ్లను కొనుగోలు చేస్తున్న రైతులు

నారాయణపేట, జూన్ 21 : ఏరువాక పౌర్ణమిని రైతులు పెద్ద పండుగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏరువాక పండుగను శనివారం జరుపుకునేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. వరుణదేవుడు ఈసారి సకాలంలో కరుణించి వర్షాలు పడటంతో ఖరీఫ్ సేద్యం అన్నివిధాల కలిసి రావాలని రైతాంగం కోటి దేవుళ్లను మొక్కుకుంటూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో గ్రామ దేవతలకు బోనాలను సమర్పిస్తు వరుణ దేవుడ్ని ప్రార్థిస్తున్నారు. వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించి పొలాలకు వెళ్లి భూతల్లికి ప్రత్యేకంగా పూజలు చేసి అన్నివిధాలుగా పంటలు కలిసి రావాలని ఇష్ట దేవుళ్లను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. ఏరువాక పండుగను ఈసారి ఘనంగా నిర్వహించుకునేందుకు అన్నదాతలు సన్నాహాలు చేస్తున్నారు.

నాటి ఉత్సాహమే వేరు

వర్షాకాలం వచ్చిందంటే చాలు సమృద్ధిగా వర్షాలు కురియడం చెరువులు, కుంటలు నిండడం పల్లెసీమలు పచ్చదనంతో కళకళ లాడుతూ ప్రతీ ఇంటి ముందు పశుసంపదతో పాటు, ధాన్యపు సిరులు కురుస్తూ నాటి కాలంలో ఉత్సాహంతో ఎంతో వైభవోపేతంగా ఏరువాక పండుగను జరుపుకునే వారమని నాటితరం ప్రస్తుత వయోవృద్ధ రైతులు చెప్తున్నారు. ఏరువాక పండుగ వస్తుందంటే చాలు వారానికి ముందే కాడెద్దులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రాంతాలతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక, యాద్గీర్, గుల్బర్గల నుంచి పట్టువస్త్రాలు, మువ్వలు, కొత్తగంటలు, పూలతాళ్లు, దిష్టితాళ్లు తదితర సామగ్రిని దిగుమతి చేసుకొని పండుగ రోజు కాడెద్దులకు చెరువులో స్నానాలు చేయించి కారింగు, సారాయి తాపి తీపి వంటకాలైన భక్షాలను తినిపిస్తామన్నారు. సాయంత్రం మూడు గంటల వరకు కాడెద్దులను ముస్తాబుచేసి పురవీధుల గుండా ఊరేగించి ఆంజనేయస్వామి ఆలయాల దగ్గర కట్టిన ఏరువాక తాడుకింద పశువులను ఊరేగించి తాడుతెంచి ఉత్సాహంగా పండుగ సంబురాలను జరుపుకొనేవారమని చెప్తున్నారు. వర్షాధార పంటలతో పాటు కాస్తో కూస్తో బోర్ల కింద సేద్యానికే పరిమితమై పశుపోషణ భారంగా మారి ఒకటి రెండు ఎద్దులు, ట్రాక్టర్లతో వ్యవసాయాన్ని నెట్టుకొస్తున్నారు. ఉన్న దాంట్లోనే కాడెద్దులను అలంకరించి అనాదిగా వస్తున్న ఆచారంగా ఏరువాక పండుగను నేటితరం రైతులు జరుపుకుంటున్నారు.

మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థుల రాస్తారోకో


మధ్యాహ్న భోజనం అందించాలని రాస్తారోకో చేపట్టిన పదర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

అమ్రాబాద్, జూన్ 21 : మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం పదర మండల కేంద్రంలో విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. పదర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొన్నిరోజుల నుంచి మధ్యాహ్న భోజనం అందించడం లేదని ఆ పాఠశాల విద్యార్థులు శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం, స్థానికులతో కలిసి అచ్చంపేట - మద్దిమడుగు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న అమ్రాబాద్ ఉమ్మడి మండల విద్యాధికారి బాలకిషన్ విద్యార్థుల వద్దకు చేరుకున్నారు. ఇక నుంచి ప్రతీరోజు పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకో విరమించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు డి.అనిల్‌కుమార్, బీఆర్ఎస్ పదర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోలి శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు ప్రశాంత్‌చారి, రాము యాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటాలి

- ఫుట్‌బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భానుకిరణ్


ఖాజా మొయినుద్దీన్‌ను సన్మానిస్తున్న భానుకిరణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 21 : ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటాలని ఫుట్‌బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ అన్నారు. పోర్చుగల్ దేశంలోని స్పోర్టింగ్ లిస్బన్ ఫుట్‌బాల్ క్లబ్ ట్రయల్స్‌కు జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఖాజా మొయినుద్దీన్ ఎంపికయ్యాడు. శుక్రవారం బాలుర కళాశాల మైదానంలో క్రీడాకారుడిని భానుకిరణ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ వాజీద్‌అలీ, మహ్మద్ హబీబుద్దీన్ ఉన్నారు.

ఇంటి మీటరుకు రూ.1.33 లక్షల కరెంటు బిల్లు

జడ్చర్ల, జూన్ 21: జడ్చర్ల మండలం మర్రి చెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చౌటగడ్డ తండాలో ఓ ఇంటికి రూ.లక్షా 33,085 విద్యుత్ బిల్లు రావడంతో ఇంటి యజమాని జంగుతిన్నాడు. తండాలో ఈనెల 11న బిల్లు ఇచ్చారని యజమాని ముడావత్ లింగ్యానాయక్ తెలిపాడు. బిల్లు లో 32 రోజులకు గాను 103 యూనిట్‌ల విద్యుత్ వినియోగించినట్లుగా ఉందని చెప్పాడు. మార్చి 31లోగా రూ.63,037, ఏప్రిల్ ఒకటో తేదీ అనంతరం మరో రూ.67,164 బకాయి ఉందని బిల్లులో ఉందని తెలిపాడు. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా బిల్లులు ఇస్తున్నారన్నారు. ఈ బిల్లు గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. బిల్లును అధికారులు మాఫీ చేస్తారని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని చెప్పారు.

పాత బాకీ అడిగినందుకు కత్తులతో దాడి

- యువకుడిపై మూడు చోట్ల గాట్లు

మహబూబ్‌నగర్, జూన్ 21 : పాన్ డబ్బాలో సిగరెట్‌కు వచ్చిన వ్యక్తిని పాతబాకీ చెల్లించాలని అడిగినందుకు ఇద్దరి మధ్య మాటామాట పెరిగి చివరికి కత్తులతో దాడిచేసే వరకు వెళ్లింది. పాలమూరు పట్టణంలోని న్యూటౌన్ సుస్రుత ఆసుపత్రి పక్కనే ఉన్న పాన్‌మహల్ వద్దకు వీరన్నపేటకు చెందిన నలుగురు వ్యక్తులు శుక్రవారం రాత్రి వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. పాతబాకీ చెల్లించాలని పాన్‌డబ్బా నిర్వాహకుడు అడగడంతో మాటామాట పెరగడంతో నిర్వాహకుడి తరఫున అతని బంధువు సోఫియాబిన్ సయ్యద్ అడ్డుకోబోగా కత్తులతో అతనిపై మూడుచోట్ల గాట్లు వేశారు. చేతికి, ఛాతిలో, వీపుపై గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుడి బంధువులు, స్నేహితులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. జరిగిన ఘటనపై టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నలుగురికి రిమాండ్

వెల్దండ, జూన్ 21 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలో ఓ క్రషర్ మిషన్‌లో ఇటీవల చోరీకి పాల్పడ్డ నలుగురిని అరెస్ట్‌చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఈనెల 16న వెంకటేశ్వర స్టోన్ క్రషర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి మందుగుండు సామగ్రి (జిలెటిన్ స్టిక్స్, ఈడీ)లు ఎత్తుకెళ్లగా సూపర్‌వైజర్ రాజు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం చోరీకి పాల్పడిన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం రాంనుంతలకు చెందిన శేఖర్, కుమార్, ఈదమయ్య, విఠాయిపల్లికి చెందిన నర్సింహ, ఆరుట్లకు చెందిన బాబులు చోరీ చేసినట్లు గుర్తించి వీరిని అరెస్ట్‌చేసి వారి వద్దనుంచి 2100 జిలెటిన్ స్టిక్స్, వెయ్యి ఫూసలను స్వాధీనం చేసుకుని నలుగురిని రిమాండ్‌కు పంపారు. వీరిలో శేఖర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక తరలింపులో సరిహద్దు వివాదం

- తెలంగాణ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న ఏపీ అధికారులు
- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేలు చొప్పున జరిమానా
- స్పందించని గద్వాల జిల్లా అధికారులు


ట్రాక్టర్లకు జరిమానా వేస్తున్న ఏపీ అధికారులు, పోలీసులు

రాజోలి, జూన్ 21 : ఏపీ - తెలంగాణ మధ్యన తుంగభద్ర నదిలో సరిహద్దుల వివాదం ఏర్పడింది. తెలంగాణ సరిహద్దు అయిన తుంగభద్ర నదిలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లో ఇసుక తరలిస్తుండగా ఆంధ్రప్రదేశ్ అధికారులు ట్రాక్టర్లను పట్టుకున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తూర్పుగార్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రజల, ప్రభుత్వం కట్టడాల అవసరాల కోసం ఇసుకను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామం శివారులో ఉన్న తుంగభద్ర నదిలో ప్రభుత్వ అనుమతితో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి, ఇసుకను తీసేందుకు అనుమతి ఇచ్చింది. ప్రజలు మన ఇసుక- మన వాహనం ద్వారా తగిన రుసుముతో మీసేవలో చెల్లిస్తే ప్రజలకు ఇంటి వద్దకే ట్రాక్టర్ వచ్చి ఇసుకను అందిస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే నదిలోకి ట్రాక్టర్లు వెళ్లి ఇసుకను లోడ్ చేస్తుండగా ఏపీ ప్రభుత్వానికి చెందిన మైనింగ్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో మూకుమ్మడిగా దాడులు చేపట్టి నదిలోకి వెళ్లిన అన్ని ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ సరిహద్దును దాటుకుని, ఏపీ హద్దులోకి వచ్చి ఇసుకను తరలిస్తున్నారని, కేసులు నమోదు చేస్తామని ఏపీ అధికారులు చెప్పి ట్రాక్టర్లను నిలిపివేశారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు వెంటనే జిల్లాలోని మైనింగ్ అధికారులకు, పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రాజోలి రెవెన్యూ అధికారులు, ఎస్సై జగదీశ్వర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏపీలోని కర్నూలు జిల్లా అధికారులు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడినట్లు కొందరు చెబుతున్నారు. ఈ విషయమై రాజోలి ఎస్సై జగదీశ్వర్‌ను వివరణ కోరగా ట్రాక్టర్ యజమానులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నామని, తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న ఆదేశాలు రాలేదని సమాధానం ఇచ్చారు. సరిహద్దు దాటకుండా తెలంగాణ హద్దుల్లోనే ఇసుకను తరలిస్తుంటే ఏపీ అధికారులు అక్రమంగా తమ ట్రాక్టర్లను పట్టుకున్నారని, వాదించారు. సాయంత్రం వరకు ఉన్నతాధికారుల చర్చలు జరపడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేలు చొప్పున మొత్తం 64 ట్రాక్టర్లకు జరిమానా వేసి వదిలేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా అధికారులు వెంటనే స్పందించకపోవడంతో డ్రైవర్లకు, ట్రాక్టర్ యజమానులకు తీవ్ర నష్టం చేకూరిందని, అటు ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్న ప్రజలకు ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో గత ప్రభుత్వం ముడుమాల గ్రామ శివారులో స్టీమర్లతో డ్రెజ్జింగ్ పద్ధతితో నదిలో నీరు ఉండగానే రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామం సరిహద్దులోకి వచ్చి ఇసుకను తోడేళ్లుగా తోడుకుపోతుంటే తెలంగాణకు చెందిన ఏ అధికారి కూడా తొంగి చూడలేదని బాధితులు వాపోతున్నారు.

నవజాత శిశువు మృతి

వనపర్తి క్రైమ్, జూన్ 21 : అప్పుడే పుట్టిన ఓ నవజాత మగ శిశువు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. డాక్టర్ ప్రసన్న తెలిపిన వివరాల ప్రకారం.. కొంకలపల్లి గ్రామానికి చెందిన మాధవి అనే మహిళ మొదటి కాన్పు కోసం రేవల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. గురువారం రాత్రి రెండు గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం తీసుకెళ్లారు. ప్రసవం అయ్యే సమయంలో శిశువు తల భాగం కాకుండా మొదట బొడ్డు పేగు బయటకు రావడంతో మహిళకు తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే శిశువును నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇలాంటి ఘటనలు ఎంతో అరుదుగా జరుగుతాయని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు. మొదటి సంతానంలోనే శిశువు మృతి చెందడంతో బాధిత మహిళ మాధవి, భర్త శ్రీను కన్నీరుమున్నీరయ్యారు.

గొర్రెల కాపరిపై మొసలి దాడి

- చాకచక్యంగా వ్యవహరించడంతో తప్పిన ప్రమాదం

ఆత్మకూరు, జూన్ 21 : గొర్రెల కాపరిపై మొసలి దాడి చేసిన సంఘటన ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామ శివారులోని కృష్ణానది ఒడ్డున చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన అంజనేయులు అనే వ్యక్తి తన గొర్రెల మందను కృష్ణానదిలో కడగడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మొసలి గొర్రెలపై దాడి చేసి గొర్రెను తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది. కాపరి గొర్రెను కాపాడుకుందాం అనే ప్రయత్నం చేయగా గొర్రెను వదిలి అంజనేయులుపై దాడి చేసి కుడికాలు పట్టి లాక్కునే ప్రయత్నం చేసింది. దీంతో ఆయన చాకచక్యంగా వ్యవహరించి మొసలిని వదిలించుకుని ఒడ్డుకు చేరాడు. నొప్పులు భరించలేక కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న మత్స్యకారులు గమనించి అక్కడికి చేరుకుని అంజనేయులును వారి సహాయంతో ఒడ్డుకు చేర్చారు. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆత్మకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స నిర్వహించిన అనంతరం పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలికితీత

రాజోలి, జూన్ 21 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులోని సుంకేసుల జలాశయంలో లభ్యమైన మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు బయటకు వెలికి తీశారు. రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుంకేసుల డ్యాం 30వ గేటు ముందు నీటిలో మృతదేహం తేలియాడుతుందని జాలర్లు ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం సిబ్బందితో కలిసి పరిశీలించామన్నారు. ఒంటిపై దుస్తులు లేకుండా కేవలం క్రీమ్ రంగు గల ప్యాంట్‌పై ఉన్న మృతదేహాన్ని జాలర్ల సహాయంతో బయటకు తీశారు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుడి కుడి చేతిపైన ఓంకారం, శివలింగం బొమ్మ, అమ్మ అని అక్షరాలతో తెలుగులో పచ్చబొట్టు ఉంది. అలాగే ఎడమచేతి భుజంపై త్రిశూలం ఆకారం గల పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తిస్తే రాజోలి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నదిలో పడి చనిపోయాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా లేక డ్యాం ఎగువ నుంచి కొట్టుకొచ్చిందా లేక ఎవరైనా హత్య చేసి డ్యాంలో పడేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జడ్చర్ల, జూన్ 21 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట ప్రాంతానికి చెందిన పెద్దగొల్ల నాగరాజు(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న మేస్త్రీ పనుల కోసం నాగరాజు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలోని భార్య బౌరమ్మ ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబీకులు భావించారు. భార్య వద్దకు నాగరాజు వెళ్లలేదని తెలిసి పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికారు. జడ్చర్ల మండలం బండమీదిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద శుక్రవారం ఉదయం నాగరాజు మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెంది ఉంటాడని నాగరాజు భార్య బౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటి గుంటలో పడి యువకుడు..

కేటీదొడ్డి, జూన్ 21 : ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం కుచినెర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రెప్పకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు వీరేష్(19) శుక్రవారం ఉదయం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందాడు. మృతుడికి ఈత రాకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

కొత్తకోట, జూన్ 21 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని జాతీయ రహదారి పాలెం బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పెద్దమందడి మండలం వెలటూరు గ్రామానికి చెందిన శివ(24) కొత్తకోట నుంచి ద్విచక్ర వాహనంపై పాలెం వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో శివ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బంగారు బిస్కెట్ చోరీ

కొత్తకోట బస్టాండ్‌లో బంగారు బిస్కెట్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వనపర్తికి చెందిన సునీత తన వద్ద ఉన్న రూ.62 వేల విలువ గల బంగారు బిస్కెట్‌ను హైదరాబాద్‌లో అమ్మి గాజులు తెచ్చుకోవాలని గురువారం కొత్తకోటకు వచ్చింది. హైదరాబాద్ బస్సు ఎక్కి, జడ్చర్ల వద్ద బ్యాగును పరిశీలించగా జిప్ తీసి ఉందని, అందులో ఉంచిన బంగారు బిస్కెట్ కన్పించలేదన్నారు. కొత్తకోటలో బస్సు ఎక్కే సందర్భంలోనే బిస్కెట్ చోరీ అయిందని శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

భూత్పూర్, జూన్ 21 : ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 20వ తేదీన పాఠశాలలో సర్టిఫికెట్లు తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రమైనా కూతురు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాగటూరులో వృద్ధురాలు..

అలంపూర్ చౌరస్తా : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామంలో వృద్ధురాలు అదృశ్యమైంది. ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీం తన తల్లి శంకరమ్మ(65)తో కలిసి ఉంటున్నాడు. ఈనెల రెండో తేదీన పనికి వెళ్లిన కాశీం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తల్లి కన్పించలేదు. దీంతో తన సోదరి వద్దకు తల్లి వెళ్లి ఉంటుందని భావించాడు. కొన్నిరోజులకు సోదరి వద్ద విచారించగా తన వద్దకు రాలేదని ఆమె చెప్పడంతో తల్లి ఆచూకీ కోసం గాలించాడు. జాడ కానరాకపోవడంతో శుక్రవారం ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాశీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ, కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూన్ 21 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం మారమునగాల-2 గ్రామంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు, ట్రాక్టర్ డ్రైవర్ పరుశరాముడు అనే ఇద్దరు కూలీలు శుక్రవారం ఇద్దరు వేర్వేరు రైతుల వద్ద పనికి వెళ్లారు. పరుశరాముడు ట్రాక్టర్ నడుపుతూ ఉన్నట్టుండి పక్క పొలంలో పనిచేస్తున్న చాకలి నాగరాజు మీదకు వాహనం తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఈ విషయంపై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటమాట పెరగడంతో ఇరువురు కొడవలి, కర్రతో దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక పట్టివేత

కొత్తపల్లి, జూన్ 21 : అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నందిగామ గ్రామ శివారులో నిల్వ ఉంచిన 50 ట్రిప్పుల ఇసుకను స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐ మధు పట్టుకొని సీజ్ చేశారు. పట్టుబడ్డ ఇసుకను ఆన్‌లైన్ ద్వారా తరలించాలని అధికారులకు సూచించినట్లు వారు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

పాలమూరు, జూన్ 21 : విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు రూ.2,09,322లు జరిమానా విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ డీకే.మహేశ్వర్‌రావు, ఎస్సై సి.అంజయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం అంకిళ్ల గ్రామానికి చెందిన జనార్దన్‌గౌడ్ తన కిరాణ దుకాణానికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకొని వాడుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు 2017 అక్టోబరులో గుర్తించి కేసు నమోదు చేశారు. అది మొదటి తప్పుగా ఆయనను వదిలేశారు. అదే వ్యక్తి 2019 అక్టోబరులో మరోసారి తన దుకాణానికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని వాడుతున్నట్లు గుర్తించిన విద్యుత్ అధికారులు కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జగన్నాథం.. జనార్దన్‌గౌడ్‌ను కోర్టులో హాజరుపర్చడంతో పూర్వాపరాలు పరిశీలించిన న్యాయాధికారి రూ.2,09,322లు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు.

పట్టాభూమిలో ఉన్న సీసీ రోడ్డును తొలగించిన అధికారులు



తుమ్మలసూగురు గ్రామంలో పట్టా భూమిలో ఉన్న సీసీ రోడ్డును ఎక్స్‌కవేటర్ సహాయంతో తీసివేస్తున్న అధికారులు

తాడూరు, జూన్ 21 : మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో కొన్ని రోజుల క్రితం వేసిన సీసీ రోడ్డు పట్టా భూమిలో ఉందంటూ కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారికి హైకోర్టు నుంచి సానుకూలంగా తీర్పు రావడంతో ఆ తీర్పు కాపీని జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి సీసీ రోడ్డును పట్టా భూమిలో నుంచి తీసివేయాలని కోరిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో తుమ్మలసూగురు గ్రామానికి అనుకుని ఉన్న పట్టా భూమిలో ఉన్న 75మీటర్ల సీసీ రోడ్డును పోలీసులు, అధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. గతంలోనే ఈ రోడ్డుకు సంబంధించి అప్పటి కలెక్టర్‌కు, పంచాయతీ కార్యదర్శులకు కోర్టు నోటీసులు అందడంతో చర్యలు తీసుకోవడం జరిగింది. అనంతరం డీపీవో కృష్ణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధుల నుంచి వేసి సీసీ రోడ్డు పట్టా భూమిలో ఉండడం మూలంగా సదరు పట్టాదారుల అభ్యర్థన మేరకు ఈ రోడ్డును కోర్టు ఆదేశాలకనుగుణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు తొలగించినట్లు తెలిపారు.

నీట్ పేపర్ లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్, జూన్ 21: నీట్ పేపర్ లీక్ చేసినటువంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అమ్రాబాద్ మండలం మన్ననూరులోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గంట పాటు శ్రీశైలం-హైదరాబాద్ వైపు వెళ్లి వచ్చే వాహనాలకు తీవ్ర అంతరాయం కల్గింది. కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు నంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, తుల్స్యా, వెంకటేశ్వర్లు, లోకనాథం, యశ్వంత్, మేరాజ్ , బాలస్వామి , రహిమాన్ పాల్గొన్నారు.

కేంద్రం బాధ్యత వహించాలి

వెల్దండ: నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలంటూ శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎంతోమంది విద్యార్థులు కష్టపడి చదివినా కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో పేపర్ లీకేజీ అయ్యిందని మండిపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధితో వ్యవహరించి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలనిఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు రషీద్, శ్రీనుయాదవ్, ఎర్రశ్రీను, పుల్లయ్య, కాడు రాం, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా



కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య దంపతులను సన్మానిస్తున్న 6వ వార్డు మహిళలు

కొల్లాపూర్, జూన్ 21 : కొల్లాపూర్ మునిసిపల్ ఎన్నికల్లో తనకు రాజకీయ అవకాశం కల్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తనకు ఓట్లు వేసి కౌన్సిలర్‌గా గెలిపించిన వార్డు ప్రజల రుణం తీర్చుకునేలా ఆరవ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానని కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. ఇటీవలే కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన 6వ వార్డు కౌన్సిలర్ మేకల రమ్య నాగరాజు దంపతులను వార్డు ప్రజలు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాలువా, పూల మాలలతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, సుదర్శన్‌శెట్టి, దూరయ్య, బద్దుల చంద్రు, వర్ధి, అమ్రాబాద్ వెంకటేశ్, శేషయ్య, పంజాబీ, అమ్రాబాద్ కృష్ణయ్య, బాలయ్య, అమ్రాబాద్ చంద్రశేఖర్‌తో పాటు భాను, రమేష్, బాలరాజు, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

తెలకపల్లి, జూన్ 21: ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల రాంరెడ్డిపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలకపల్లి మండల విద్యా వనరుల కేంద్రం, భవిత విలీన విద్యా వనరుల కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయా పాఠశాలకు సంబంధించిన వివిధ రకాల రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివే ప్రతీ ఒక్క విద్యార్థికీ ఉచిత పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను ఏకరూప దుస్తులను తప్పనిసరిగా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం తరగతి వారిగా విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచిగా 100శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. భవిత విలీన విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి అక్కడ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఐఈఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోజువారిగా మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల సంఖ్యను ప్రధానోపాధ్యాయులు మొబైల్ యాప్ ద్వారా ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటలకు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది కాశీనాథ్, వెంకటేశ్, ఐఈఆర్పీలు రాజావర్ధన్‌రెడ్డి, బాల్‌నరసింహ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

ఊర్కొండ, జూన్ 21: అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, శిఖం భూములను కాపాడాలని మండలంలోని తిమ్మన్నపల్లి గ్రామస్థులు తహసీల్దార్ చెన్న కిష్టన్నకు శుక్రవారం వినతపత్రం సమర్పించారు. తిమ్మన్నపల్లి గ్రామ శివారులోని చాకలి కుంట, కొర్లకుంట, బండ కుంట, గుండ్ల చెరువు, మొండికుంటలున్నాయన్నారు. చాకలి కుంటలోని శిఖం భూమిలో మా తాత ముత్తాతల నుంచి కొంత భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు.

మేము ఆనవాయితీగా దున్నుతున్న మా భూములను దున్నడానికి మూడు రోజుల క్రితం పోతే సంబంధిత అధికారులు వచ్చి మమ్ములను దున్ననివ్వకుండా అడ్డుకున్నారు. తరతరాల నుంచి మేము సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న భూమిపై మాకు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని, అదేవిధంగా మిగతా అన్ని కుంటలలో సాగు చేసుకుంటున్న వారిని కూడా సాగు చేయకుండా ఆపాలని వినతిపత్రంలో తెలియజేశారు. రైతులు శేఖర్, సాయన్న, రంగయ్య, చిన్న బాలయ్య, చెన్నయ్య, జంగయ్య, చెన్నయ్య, పెద్ద బాలయ్య, శీను శేఖర్, అంజనేయులు, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ బదావత్ సంతోష్



కలెక్టరేట్ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

నాగర్‌కర్నూల్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ వారు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకుంటామని, ఇందులో భాగంగా మన జిల్లాలో కలెక్టరేట్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు ఆధ్యాత్మిక, ప్రయోజనాలు కలుగుతాయని, వీటిపై అవగాహన పెంచుకోవడం కోసమే ప్రతీ ఒక్కరు ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని చెప్పారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కేసీ తారారామావు, డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆయుష్ వైద్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరీరానికి యోగా చాలా అవసరం: ఎస్పీ

శరీరానికి యోగా చాలా అవసరమని, ప్రతీరోజు యోగా చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా ఎస్పీ ఆఫీస్‌లో ఎస్పీ 200మంది పోలీస్ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ భరత్, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ వారితో పాటు సీఐలు, ఆర్ఐ జగన్, ఆర్‌ఎస్ఐ గౌస్‌పాషా, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఎత్తం, కొండ్రావుపల్లి తదితర పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు జరుపుకున్నారు. కొండ్రావుపల్లి ప్రధానోపాధ్యాయుడు బాలకిష్టయ్య, ఎత్తం పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, రమణయ్య, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివులు, వెంకటేష్ మాట్లాడుతూ యోగా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కల్వకుర్తి కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య అన్నారు. ప్రతీ ఒక్కరు విధిగా యోగాను అలవర్చుకోవాలని వారు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయాధికారులు సిబ్బందితో కలిసి యోగా చేశారు. యోగా అనంతరం వారు మాట్లాడుతూ సంపూర్ణ మానసిక వికాసానికి ధ్యానం, యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు. పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రాముఖ్యతను వివరించారు. యోగా భవనంలో సరస్వతీ శిశు మందిర్‌లో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వక్తలు మాట్లాడుతూ యోగా నిత్య జీవితంలో ఎంత ఉపయోగపడుతుందో తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్‌గౌడ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి యోగా సాధనతో లాభాలు

● కల్వకుర్తిటౌన్: ప్రతీ ఒక్కరికి యోగా సాధనతో ఎన్నో లాభాలు ఉంటాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులతో యోగా సాధన చేయించి మాట్లాడారు. గర్భిణులు వైద్యుల సూచన మేరకు ఆసనాలను సాధనచేస్తే సుఖప్రసవం అయ్యేందుకు వీలుంటుందని ఆయన సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఆసుపత్రి వైద్యులు స్వర్ణలత, యశోద, పాండురంగ, నర్సింగ్ అధికారులు, సిబ్బంది డాక్టర్ ఖలీల్ ఉర్ రహమాన్, వెంకటేష్, వెంకటయ్య ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో యోగాసనంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



కల్వకుర్తి కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయాధికారులు, సిబ్బంది

● అచ్చంపేట టౌన్: రోజూ ఉదయం వేళలో యోగా చేయడం వల్ల మనం నిత్యం సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో యోగా గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు.

● బిజినేపల్లి: దైనందిన రోజువారీ జీవనచక్రంలో యోగాసనాలు భాగమయితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని జిల్లా పరిషత్ సీఈవో గోపాల్ నాయక్ అన్నారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాని పురస్కరించుకొని మండలంలోని నంది వడ్డెమాన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి యోగాసనాలు సాధన చేసి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో కతాలప్ప గౌడ్, ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి పాల్గొన్నారు.

● అమ్రాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అమ్రాబాద్ మండల కేంద్రంలోని అమరేశ్వర ఆలయం ఆవరణలో శుక్రవారం వివిధ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ యోగాసనాలు ప్రాక్టీస్ చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. బీజేపీ నాయకులు గోలి రాజు, శంకర్ గౌడ్, చంద్రయ్య గౌడ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు ప్రాక్టీస్ చేయించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ మహేష్ హాజరై యువకులతో కలిసి యోగా చేశారు. ఆయా గ్రామాల యువకులు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల యోగాసనాలు

వెల్దండ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలు స్థానికంగా ఉన్న అమృత్‌సరోవర్ చెరువుల వద్ద యోగా చేశారు. చెర్కూర్ గ్రామంలో నిర్వహించిన యోగాడే కార్యక్రమంలో ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఏపీవో ఈశ్వర్‌లు పాల్గొని కూలీలతో యోగా చేయించారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈసీ, మేట్‌లు పాల్గొన్నారు.

● తెలకపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు యోగా యొక్క

● ఊర్కొండ: యోగా దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ముచ్చర్లపల్లి, రాచాల పల్లి గ్రామాల్లో యోగసనాలు నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, యోగా గురువులు అంజనేయులు, మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు, మ్యాకల శ్రీనివాసులు, కొమ్ము రాజయ్య నాయకులు సందీప్ కొమ్ము శ్రీను, మల్లేష్ గోపీ, లక్ష్మణ్, అంజనేయు లు రాజేందర్, రేపని శ్రీనివాస్, పరుశురాములు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు అల్వాల అర్జున్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో పట్టణ యువకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు యోగా ఆసనాలు వేశారు.



అమరేశ్వర ఆలయం ఆవరణలో యోగాసనాలు ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులతో యోగా సాధన చేయిస్తున్న వైద్యులు

సమగ్ర విచారణ జరిపించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో ఆందోళన



కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దకొత్తపల్లి, జూన్ 21 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళపై జరిపిన పాశవిక ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం చౌరస్తాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ ఓ చెంచు మహిళను అర్ధరాత్రి కాళ్లు చేతులు కట్టేసి కంట్లో కారం చల్లి ఆమెపై డీజిల్ పోసి కాల్చిన వైనం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ధ్వజమెత్తారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పదెకరాల భూమి, 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం చేయకుండా చర్యలు తీసుకోవాలని వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బి.శివవర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్, సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు లలితమ్మ, ఎండి.సలీం, బాలకిరణ్‌కుమార్, ముంతాజ్‌అలీ, జల్లాపురం సురేందర్, బత్తిని రాజు, రాముడు, అంజినాయక్, బాలస్వామి, రమణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: చెంచు మహిళను చిత్రహింసలు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, మహిళా సంఘం నాయకులు మల్లేశ్వరమ్మ, ఓంకారమ్మ, మహాలక్ష్మి, చిట్టెమ్మ, తిమ్మస్వామి పాల్గొన్నారు.

పరామర్శించిన ఎల్లేని

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళను చిత్రహింసలకు గురిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి తదితరులు ఉన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించాలి

కొల్లాపూర్ : మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళపై జరిగిన పాశవిక దాడిని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తున్నామని దాడి ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెంచుల స్థితిగతులపై స్పందించని ఐటీడీఏ పీవో వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జిల్లాలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో తక్షణమే అరెస్టులు జరగకపోతే అఖిలపక్ష పార్టీలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. చెంచు బాధిత మహిళను పరామర్శించిన మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ గూట విజయ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ పరమేశ్‌మాదిగలు పాల్గొన్నారు.

● మన్ననూర్: మొలచింతలపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ చెంచు మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివాసీ చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు శుక్రవారం ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివాసీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి ఆర్థిక సహాయం అందించాలని, చెంచు మహిళ అని కూడా కనికరం లేకుండా దాడికి పాల్పడిన వ్యక్తులపై నిర్భయ చట్టం కింద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ నాయకులు ఎస్పీని కోరారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళను పరామర్శించారు. ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు రామస్వామి, నిమ్మల శివ, వెంకట్, స్వామి, పరమేష్, లింగస్వామి పాల్గొన్నారు.

దోషులను తప్పించే ప్రయత్నాలు

● కందనూలు: మొలచింతలపల్లి బాధితురాలి విషయంలో దోషులను తప్పించే ప్రయత్నాలు జరగడాన్ని చైతన్య మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి, మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు కస్తూరి, శాంత, వనపర్తి జిల్లా కన్వీనర్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం బాధితురాలును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

పెద్దకొత్తపల్లి, జూన్ 21: మిషన్ భగీరథ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో శ్రీరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి, కల్వకోల్, గంట్రావుపల్లి గ్రామాలను సందర్శించి మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అలాగే పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను ఎంపీడీవో నాగేంద్రం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వి ఉన్నారు.



మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీరాం

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ, జూన్ 21 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బైక్ మెకానిక్ నార్లకంటి పాండు కుటుంబానికి తన తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఈ మేరకు పదవ తరగతి చదివిన స్నేహితులు రూ.60 వేలు సమీకరించి పాండు కూతురు పేరిట డిపాజిట్ చేశారు. భవిష్యత్తులో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. రవీంద్రాచారి, మట్టవేణు, సురేష్, శ్రీను, రమేష్ చారి, శ్రీనివాస్, వెంకటయ్య లింగమయ్యలు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

కోడేరు, జూన్ 21 : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఎత్తం గ్రామంలో ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి శ్రీరాం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాం మాట్లాడుతూ మండల కేంద్రంలో శ్రీసాయి ఫర్టిలైజర్, శ్రీసాయికిరణ్ ట్రేడర్స్, శివట్రేడర్స్, ఎత్తం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఉన్న వరి విత్తనాలను తనిఖీ చేశామన్నారు. వరి విత్తనాల నాణ్యత, పరిమాణాల నమూనాల కోసం వాటిని హైదరాబాద్‌లోని మలక్‌పేట విత్తన పరీక్ష కేంద్రానికి పంపడం జరుగుతుందన్నారు. విత్తన డీలర్లు ఫర్టిలైజర్ డీలర్లు, ఏఈవోలు మధుసూదన్‌రెడ్డి, ముజీబ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎం.కనకయ్య



కందనూలు, జూన్ 21 : టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా జిల్లా వాసి ఎం.కనకయ్యను జాతీయ నాయకత్వం ఎన్నుకున్నారు. రెండు రోజులుగా ఖమ్మం జిల్లాలోని టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహా సభలు నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా, కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సమస్యలపై కృషి చేసిన వారిని ఎన్నుకున్నారు. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వాసి ఎం.కనకయ్యను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకోవడంతో పలువురు జర్నలిస్టులు ఆనందం వ్యక్తం చేశారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కందనూలు, జూన్ 21 :ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జేఎస్ఆర్ ఫౌండేషన్ సమస్త ముఖ్య ఉద్దేశమని జేఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జమ్ముల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ సౌజన్యంతో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో కళ్లజోడు, కంటి మందు, ఈసీజీ, దంత పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. యశోద హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, వైద్యులు జయ, సాయి, ప్రతిభ, సంతోషి, ఉమాదేవి పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులపై ముమ్మర తనిఖీలు

తాడూరు, జూన్ 21 : తెలంగాణ ప్రభుత్వం ధరణిలో వస్తున్న భూ సమస్యలపై త్వరగా పరిష్కరించాలంటూ పై అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి నెలకొంటుండడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీల, డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీలు కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలన్నింటినీ రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించి పూర్తి నివేదిక కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉందని తహసీల్దార్ ప్రమీల తెలిపారు.

ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

కల్వకుర్తి, జూన్ 21 : కల్వకుర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్.శ్రీను, పలువురు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు మొదటిసారిగా ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను ఆర్డీవో బొకేతో సత్కరించారు.

ద్విచక్ర వాహనాల వేలం

కొల్లాపూర్, జూన్ 21: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఏడు ద్విచక్ర వాహనాలను శుక్రవారం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుధాకర్ సమక్షంలో కొల్లాపూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగిరెడ్డి వేలం వేశారు. ఉదయం 11గంటలకు కొల్లాపూర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ప్రారంభమైన వేలంలో పట్టుబడిన ఏడు ద్విచక్ర వాహనాలకు ప్రభుత్వం 75వేల రూపాయల ధర నిర్ణయించగా వేలం ద్వారా ఒక లక్ష 22వేల 800రూపాయలు వచ్చిందని, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీ 21వేల 276 రూపాయలతో కలుపుకుని మొత్తం రూ.లక్షా 44వేల 76రూపాయలు ఏడు వాహనాలకు వేసిన వేలంలో ఎక్సైజ్ కార్యాలయానికి నగదు సమకూరిందని ఆయన పేర్కొన్నారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, జూన్ 21: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు హెచ్చరించారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టినట్లు వారు తెలిపారు. తనిఖీలలో నెంబర్ ప్లేట్లు సరిగా లేని 20 వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. వారికి వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలను నడవకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి హెచ్చరించారు. తనిఖీలలో 2వ ఎస్ఐ రాంచందర్‌జీ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

తిమ్మాజిపేట, జూన్ 21 : ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అమ్మకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు సూచించారు. మండల పరిధిలోని గొరిట ఎరువుల దుకాణాన్ని తిమ్మాజిపేటలోని సింగిల్ విండో కార్యాలయంలో ఇఫ్కో ఎరువుల దుకాణం, ఆగ్రో రైతు సేవ కేంద్రంలోని ఎరువుల గోదామును విత్తనాలు, పురుగుల మందులు అమ్మే దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక

వంగూరు జూన్ 21: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో పీడీ ఒబిలేష్ హాజరయ్యారు. మండలంలోని జరిగిన ఉపాధిహామీ పనులపై సిబ్బందితో సమీక్షించారు. ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకలపై ప్రజావేదికలో చోటుచేసుకుంటే సిబ్బందిని బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో విజయభాస్కర్, ఏపీవో శివశేఖర్ తదితరులు ఉన్నారు.